క్లుప్తంగా

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష ఖరారు చేసినట్లు సోమవారం కోర్టు, పోలీసు సిబ్బంది తెలిపారు. వివరాలు..విశ్వనగర్‌లో మద్యం సేవించి రోడ్డుపై వెళ్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిపైన పోలీసులు కేసు నమోదు చేసి హాజరు పరచగా అడ్డాకుల వెంకటరమణకు 15రోజులు, అవుల జయచంద్రకు ఐదు రోజులు శిక్ష విధించారు. మరో కేసులో.. విశ్వనగర్‌లో దారిలో వెళ్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికుల సమాచారం మేరకు షేక్ బషిరుల్లాను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా ఏడు రోజులు శిక్ష విధించారని వివరించారు.

చర్యలు తీసుకోండి

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం నిర్దేశించిన దాని కంటే అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ అధ్యక్షుడు రఫీ కోరారు. ఈ మేరకు సోమవారం డీఆర్ఓ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. రఫీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో పలు విద్యా సంస్థలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని, రూ.120 చెల్లించాల్సి ఉండగా కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యా లు ఒక విద్యార్థి నుంచి రూ.1500 నుంచి రూ. 2వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

గుంటూరు జిల్లాకు వెళ్లి పింఛన్ అందజేత



నాగమణికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివలక్ష్మి

శిరివెళ్ల: మండలంలోని కామినేనిపల్లెకు చెందిన పగిడి నాగమణికి ఇటీవల వితంతు పింఛన్ మంజూరైంది. మొదటి పింఛన్‌ను వలంటీర్ శివలక్ష్మి అందజేసింది. అయితే అనారోగ్యం కారణంగా గుంటూరు జిల్లా తెనాలి మండలం కేతవరం గ్రామంలోని బంధువుల వద్ద వెళ్లింది. విషయం తెలుసుకున్న వలంటీర్ శివలక్ష్మి సోమవారం అక్కడి వెళ్లి ఆమెకు పింఛన్ అందజేసింది.

తోటల పెంపకంపై అవగాహన

రుద్రవరం: పండ్ల తోటల పెంపకానికి వంద శాతం రాయితీతో మొక్కలు సరఫరా చేస్తామని ఐటీడీఏ ప్రోగ్రాం ఆఫీసర్ రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మండలంలోని హరినగరంలో సోమవారం ఐటీడీఏ అధికారులు చెంచులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొలాల్లో మామిడి చెట్లు, షరబత్ గడ్డలు ఇతర ఫలసాయానికి సంబంధించిన మొక్కలను వందశాతం రాయితీతో సరఫరా చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామానికి చెందిన చెంచులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగముని అధికారులను సత్కరించారు.

రౌడీ షీటర్ల బైండోవర్

శిరివెళ్ల: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం దెబ్బతినరాదని రౌడీ షీటర్లపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. మండలంలో శిరివెళ్ల, వీరారెడ్డిపల్లె, కామినేనిపల్లె, గుంప్రమాన్‌దిన్నె, రాజనగరం, మోత్కులపల్లె, బోయలకుంట్ల, యర్రగుంట్లలో మూడు రోజుల నుంచి 11 మంది రౌడీషీటర్లు, 11 మంది అనుమానుతులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. సోమవారం ఎస్‌ఐ సురేష్ మాట్లాడుతూ బైండోవర్ అయిన నాటి నుంచి 6 నెలలవరకు రౌడీషీటర్లు, అనుమానితులు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు, దాడులుకు పాల్పరాదని హెచ్చరించారు.


అప్రమత్తంగా ఉండాలి

ఉయ్యాలవాడ : ఉద్యోగులు నమోదులో అప్రమత్తంగా ఉంటూ యువతీ, యువకులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నమోదు కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని చెప్పారు. ముందస్తుగా గ్రామాల్లో వీఆర్‌ఓలు కూడా ప్రజలకు అవగాహన కల్పించేందుకు టాంటాం వేయించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణ, ఆర్‌ఐ సత్తార్ పాల్గొన్నారు.

రోటరీ సేవలను విస్తరించాలి

నంద్యాల(వ్యవసాయం): మారుమూల గ్రామాలకు కూడా రోటరీ సేవలను విస్తరించాలని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాణిక్ ఎస్.పవర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రోటరీ భవనంలో రోటరీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సందర్భంగా పట్టణంలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన డాక్టర్ వరదరాజు, బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత శ్రీనివాసరెడ్డి, కవి ప్రసాద్, మున్సిపల్ స్కావెంజర్ శ్రీనివాసులు, బెస్ట్ అవార్డు గ్రహీతలు పోస్టుమెన్ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మయ్య, కానిస్టేబుల్ భరత్‌కుమార్‌రెడ్డి, రైల్వే పోలీసు కిశోర్‌కుమార్, నర్స్ శాంతకుమారిని సన్మానించారు. అనంతరం విశిష్ట సేవలు అందించిన రోటరీ అధ్యక్షుడు దండె దస్తగిరిని అభినందించారు.

విజయవంతం చేయండి



ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 17, 18, 19 తేదీల్లో పట్టణంలో జరిగే ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, శ్రీనివాసులు కోరారు. సోమవారం పట్టణంలో కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. హుసేన్‌బాషా, రమేష్, నాగరాజు, ఇమ్మానియేల్ శంకర్ పాల్గొన్నారు.

పాదయాత్రలో చెప్పారు.. నేడు చేస్తున్నారు

- రాజకీయాలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా





శ్రీనివాస సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న హబీబుల్లా

నంద్యాల: ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సంక్షేమ యాత్ర పేరుతో పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకొని నేను విన్నాను.. నేను ఉన్నాను.. అని నాడు పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ సీఎం అయిన వెంటనే అమలు చేసి చూపి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే శిల్పా స్వగృహంలో మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, నాయకులు, అభిమానులు, కౌన్సిలర్ల మధ్య కేక్ కట్ చేసి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమస్యలు తెలుసుకోవడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 341రోజుల పాటు 3,648 కిలోమీటర్లు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను తెలుసుకున్నారన్నారు. నేడు కుల, మత బేధం లేకుండా రాజకీయాలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రిగా ఖ్యాతి గడించారని కొనియాడారు. బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు నామినేటెడ్, కాంట్రాక్టులలో 50శాతం అవకాశం కల్పిస్తూ చట్టం చేశారన్నారు. అంతేగాకుండా నామినేటెడ్ పదవుల్లో 50శాతం మహిళలకు అవకాశం ఇచ్చి మహిళల్లో సుస్థిర స్థానం కల్పించారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో పడేసి అప్పగించిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, కరోనా వంటి సమస్యలు వచ్చినా సంక్షేమ పథకాల అమలును నిలిపివేయకుండా అందజేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్మాల్ ఇండస్ట్రీయల్ డైరెక్టర్ కలాం, రామలింగారెడ్డి, నంద్యాల వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు జాకీర్‌హుసేన్, పున్నా శేషయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ కైపరాముడు, వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ విజయశేఖర్ రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు మల్లికార్జున, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



చాగలమర్రిలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

హబీబుల్లా ఆధ్వర్యంలో..

స్థానిక ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా ఆధ్వర్యంలో ప్రజాసంకల్ప యాత్ర ఆరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ప్రజాసంకల్ప యాత్రతో పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు.

చాగలమర్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజాసంకల్ప యాత్ర దిక్సూచి లాంటిదని జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్ అన్నారు. జగనన్న జనసంకల్పయాత్ర చేపట్టి నేటికి ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వైస్ ఎంపీపీ ముల్లా.రఫీ, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, ఎంపీటీసీ ఫయాజ్, ప్రచార కార్యదర్శి రఫీ, నాయకులు అబ్దుల్లా, ముల్లా.బురాందీన్, షేక్. షబ్బీర్, వి.మహబుబ్‌షరీఫ్ ఉన్నారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

బొమ్మలసత్రం: స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కారిస్తామని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నంద్యాలలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 103 వినతులు అందాయి. ఆయన మాట్లాడుతూ..చట్టపరిధిలో ఉన్న సమస్యలకు అక్కడిక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అలాగే స్పందనకు రాలేని ఫిర్యాదుదారులు సెల్ 9154987020 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు కాపీని పంపాల్సిందిగా కోరారు. అలాగే శాంతిభద్రల విషయాల కోసం ఈ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఎస్‌బీ డీఎస్పీ సంతోష్, సీఐలు సూర్యమౌళి, దస్తగిరి బాబు ఉన్నారు.

విజ్ఞప్తులకు పరిష్కారం చూపండి



వినతులను స్వీకరిస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

నంద్యాల: స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన విజ్ఞప్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమంలో జేసీతో పాటు డీఆర్‌ఓ పుల్లయ్య ఇతర జిల్లా లధికారులు జిల్లాలోని వివిధ నలమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతలు స్వీకరించారు. మొత్తం 193 దరఖాస్తులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని జేసీ అధికారులను ఆదేశించారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి

గోస్పాడు: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని యాళ్లూరు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు లబ్ధి చేకూరిన కరపత్రాలు అందజేసి వివరించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు శకుంతలమ్మ, మండల ఉపాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, యాళ్లూరు సొసైటీ ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, సర్పంచ్ గడ్డం రత్నమ్మ, ఉప సర్పంచ్ బెక్కెం నాగేశ్వర రెడ్డి, ఎంపీటీసీలు భారతి, కల్యాణి, నాయకులు కైప శివరామిరెడ్డి, బెక్కెం రామచంద్రారెడ్డి, బెక్కెం రామేశ్వర్ రెడ్డి, కైప శ్రీనివాస్ రెడ్డి, బెక్కెంరాజారెడ్డి,ఈశ్వర్ రెడ్డి , వంగల నాగనందిరెడ్డి, అరవింద ప్రసాద్ పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని సంజీవనగర్‌లో రాకేష్ (23) అనే బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ సీఐ ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సంజీవనగర్‌లో నివాసముంటున్న శ్రీదేవి, రమేష్‌లకు రాకేష్ ఒకే కుమారుడు. రాకేష్ పట్టణ శివారులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కొన్ని పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు పోలీసులకు సమాచారమివ్వగా వారు వచ్చి మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ వివరించారు.

సద్వినియోగం చేసుకోండి

రుద్రవరం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బాబు ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలో రుద్రవరం–1వ సచివాలయం పరిధిలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీపీ 24మందికి, 32 మందికి షుగర్, ఐదుగురు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు.

ఓపీ పుస్తకాల పంపిణీ

దొర్నిపాడు: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భా గంగా స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నూతనంగా వచ్చిన ఓపీ పుస్తకాలను డాక్టర్లు నాగేంద్ర, రుహుల్లా ఖాన్ సోమ వారం ఎంఎల్‌హెచ్‌పీలకు అందజేశారు. వారు మాట్లాడుతూ 1800 పుస్తకాలు వచ్చాయని, వ్యక్తిగత ఆరోగ్య సమాచారం, మునుపటి వైద్య, శస్త్రచికిత్స చరిత్ర, కుటుంబీకుల ఆరోగ్య వివరాలు నమోదు చేస్తారన్నారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించండి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా పారదర్శకమైన జాబితా రూపకల్పనకు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటనరీ హాల్‌లో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనపై ఈఆర్వో, ఏఈఆర్వోలు, అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు తావివ్వరాదని సూచించారు. పాణ్యం నియోజకవర్గం నుంచే ఎన్నికల ప్రక్రియ నిర్వహణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించిందని, ఈ మేరకు సంబంధిత అధికారులు పూర్తిస్థాయి దృష్టి సారించాలని చెప్పారు. ఒకే ఇంట్లో పది ఓట్లకు మించి ఓటర్లు ఉంటే మరోసారి రీ వెరిఫికేషన్ చేయాలని సూచించా రు. జంక్ క్యారెక్టర్స్ ఉన్న లోపాలు, చిరునామాలో మార్పులు, ఫొటో మిస్ మ్యాచింగ్ తదితర లోపా లు లేకుండా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం చేయాలని కోరారు. ఒక పోలింగ్ స్టేషన్‌లో 2 శాతం ఓట్ల తొలగింపులు, 4 శాతం ఓట్ల చేర్పులు ఉంటే ఈఆర్‌ఓలు నిశితంగా పరిశీలించి ఇందుకు సంబంధించిన కారణాలను రికార్డుల్లో న మోదు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య, అన్ని నియోజకవర్గాల ఈఆర్వో, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

రెఫర్ కేసులను పరిష్కరించండి

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో గుర్తించి రెఫర్ చేసిన పేషెంట్లను సంబంధిత ఆస్పత్రులకు తరలించి జీరో స్థాయికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం, వైఏపీ నీడ్స్ జగన్ అంశాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి నుంచి జిల్లా కలెక్టర్, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, వైద్య,ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని వలంటీర్ల ద్వారా డౌన్‌లోడ్‌కు చర్య లు తీసుకోవాలన్నారు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శారదాబాయి, డీసీహెచ్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్ల, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ వరప్రసాద్, డీఎల్‌డీఓ జనార్దన్ పాల్గొన్నారు.



గుండెపోటుతో ఈఓపీఆర్‌డీ మృతి

చాగలమర్రి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌డిగా విధులు నిర్వహిస్తున్న సంగటి సామ్యూల్ సుందర సుదర్శనరావు (56) గుండె పోటుతో ఆదివారం రాత్రి నంద్యాలలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..ఆదివారం రాత్రి ఛాతిలో నొప్పి ఉందని చెప్పడంతో నంద్యాలలోని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారని తెలిపారు. సోమవారం ఉదయం మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన వైఎస్సార్ కడప జిల్లా, కాశీనాయన మండలం, నరసాపురం గ్రామానికి తరలించారు. విషయం తెలుసుకున్న జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్.బాబులాల్, పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్ నరసాపురం గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అలాగే స్థానిక ఎంపీడీఓ, పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది సుదర్శనరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

యువకుడిపై కత్తితో దాడి

చాగలమర్రి: మండలంలోని చిన్న వంగలి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్న చిన్నపాటి ఘర్షణ యువకుడిపై కత్తితో దాడి చేసే వరకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిన్న వంగలి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం సెలవు కావడంతో గ్రామానికి చెందిన యువకులు, విద్యార్థులు క్రికెట్ ఆడుకుంటుండగా, మైదానం గేటు తెరవమని అక్కడే ఉన్న కొందరిని నిందితుడు షేక్.మహబూబ్ బాషా సూచించగా ఓ యువకుడు కొంత ఆలస్యం చేయడంతో చితకబాదాడు. దీంతో అక్కడే ఉన్న కర్నాటి వెంకటేశ్వరరెడ్డి వారించగా, మహబూబ్‌బాషా కోపోద్రిక్తుడై అతనితో ఘర్షణకు దిగాడు. అంతటి ఆగక సోమవారం ఉదయం వేంకటేశ్వరరెడ్డి పశువుల పాకలో బర్రెలకు మేత వేస్తుండగా మహబూబ్‌బాషా అక్కడికి వెళ్లి కత్తితో దాడి చేశాడు. గాయపడిన ఆయనను స్థానిక కేరళ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని, ప్రస్తుతం పరారీలో ఉన్నాడని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతునాయక్ తెలిపారు.

అపోహలు నమ్మకండి

ఆళ్లగడ్డ: టిడ్కో గృహాలు మంజూరైన లబ్ధిదారులు అపోహలు నమ్మొద్దని, అన్ని వసతులు కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే అని టిడ్కో క్వాలిటీ కంట్రోల్ డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఇటీవల ఓ పత్రికలో వసతులు సక్రమంగా లేవు, పనులు నాసిరకంగా ఉండటంతో లబ్ధిదారులు గృహాల్లో చేరేందుకు ముందుకు రావడం లేదని ప్రచురించారు. దీంతో సోమవారం క్వాలిటీ కంట్రోల్ డీఈ టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంకా నిర్మాణం పూర్తి కాని గృహంలో నిర్మాణ సంస్థకు చెందిన సిబ్బంది నివాసం ఉంటే ఆ ఇంటి బాత్ రూం ఫొటోలు తీసి లబ్ధిదారులు వచ్చి వెనక్కి పోతున్నారని రాయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అన్ని సౌకర్యాలు పూర్తయ్యాకే లబ్ధిదారులు చెక్‌లిస్ట్ చూసి అందులో ఉన్న సుమారు 50 అంశాలు అన్ని సంతృప్తిగా ఉన్నాయని సంతకం పెట్టిన తరువాతనే వారికి అందజేస్తామన్నారు. సీఎల్‌డీసీ రామసుబ్బయ్య, ఏఈలు వెంకటేశ్వరనాయక్, ప్రసాదరెడ్డి ఉన్నారు.

యాంత్రీకరణతో అదనపు దిగుబడి



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా

చాగలమర్రి: వ్యవసాయంలో యాంత్రీకరణతో 20 శాతం అదనపు దిగుబడి పొందొచ్చని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బుగ్గ రస్తాలో గల పంట పొలాలకు క్రిమి సంహారక మందులను పిచికారీ చేయటానికి ఫామ్ విస్టా కంపెనీకి చెందిన డ్రోన్ ట్యాంకర్‌ను రిమోట్ ద్వారా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విత్తనం వేసినప్పటి నుంచి పంట కోత దశ వరకు రైతు శాస్త్రీయ పద్ధతులు పాటించి, యంత్రాలను ఉపయోగిస్తే అధిక లాభాలు వస్తాయన్నారు. అలాగే హైదరాబాద్ పట్టణానికి చెందిన ఫాంవిస్టా కంపెనీకి చెందిన డ్రోన్ ట్యాంకర్‌లు రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు. భారతీ సీడ్స్ ఎండీ జనార్ధన్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్‌పాటిల్ పాల్గొన్నారు.

